గంట పాటు ఏకధాటిగా

దంచికొట్టిన వాన

- ఎల్బీనగర్, మలక్‌పేట, మహేశ్వరం నియోజకవర్గాల్లో జలమయమైన రోడ్లు, జనజీవనం అస్తవ్యస్తం
- పలుచోట్ల నిలిచిపోయిన వరదనీరు, స్తంభించిన ట్రాఫిక్
- నేలకూలిన చెట్లు.. వరదనీటిలోనే వాహనదారుల ప్రయాణం
- కరెంటు కోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- వాతావరణం చల్లబడటంతో ఊపిరిపీల్చుకున్న జనం

మలక్‌పేట, మే 16 : దిల్‌సుఖ్‌నగర్, మూసారాంబాగ్, మలక్‌పేట ప్రాంతాల్లో గురువారం సాయంత్రం గంటసేపు ఏకధాటిగా వర్షం కురిసింది. రోడ్లు జలమయమయ్యాయి.. వరదనీరు రహదారులను ముంచెత్తటంతో ట్రాఫిక్ స్తంభించింది. మోకాలిలోతు వరదనీటిలో ప్రయాణిస్తూ వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. వరద ప్రవాహంతో నాలాలు ఏరులను తలపించాయి. మలక్‌పేట లోని మూసారాంబాగ్ మెట్రో స్టేషన్, మలక్‌పేట గంజ్‌వద్ద న్యూ మార్కెట్ మెట్రో స్టేషన్ వద్ద వరదనీరు జాతీయ రహదారిని ముంచెత్తింది. మలక్‌పేట రైల్వేస్టేషన్‌వద్ద ఆర్‌యూబీ వరదనీటితో నిండిపోవడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దాంతో జాతీయ రహదారిపై చాదర్‌ఘాట్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు, నల్గొండ చౌరస్తానుంచి సంతోషన్‌గర్ చౌరస్తావరకు భారీగా ట్రాఫిక్ స్తంభించింది. అప్రమత్తమైన మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిబ్బంది మ్యాన్‌హోళ్ల మూతలను ఎత్తి వరదనీరు వెళ్లిపోయేలా చర్యలు తీసుకున్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నడుము లోతు నీటిలో వాహనదారులు ప్రయాణం సాగించారు.

మలక్‌పేట ఆర్‌యూబీ వద్ద వరద ప్రవాహం

చింతలకుంట కేఎల్ఎం మాల్ వద్ద జాతీయ రహదారిపై చేరిన వరదనీరు

భారీ వర్షానికి నేలకూలిన చెట్లు..

సైదాబాద్ : ఆకాల వర్షానికి మలక్‌పేట నియోజకవర్గంలో పలు ప్రాంతాలు జలమయ్యాయి. రెండు గంటలపాటు దంచికొట్టిన వర్షానికి పలు చోట్ల చెట్లు నేలకూలాయి. వర్షం మూలంగా నాలుగు గంటలపాటు విద్యుత్ అంతరాయం కలగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. మలక్‌పేట-దిలసుఖ్‌నగర్ ప్రధాన రహదారి, సైదాబాద్ శంశ్వేరబజర్ రహదారి, సైదాబాద్ ప్రధాన రహదారిపై వరదనీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వాహనాల రద్దీని తొలగించటానికి ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. లోతట్టు ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్ల వద్ద జీహెచ్ఎంసీ సిబ్బంది తగిన జాగ్రత్తలను తీసుకున్నారు. విద్యుత్, జీహెచ్ఎంసీ సిబ్బంది పలు ప్రాంతాల్లో నేలకూలిన చెట్లను తొలగించి,విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వర్షంతో వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందినట్లయింది.

జనజీవనం అస్తవ్యస్తం

మన్సూరాబాద్ : గంట పాటు కురిసిన భారీ వర్షానికి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. గురువారం మధ్యహ్నం 3 గంటల నుంచి మేఘాలు కమ్ముకోవడంతో కాలనీల్లో కారుచీకటి నెలకొంది. సుమారు 4 గంటలకు ప్రారంభమైన వర్షం 5 గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురిసింది. దీంతో మన్సూరాబాద్ డివిజన్ పరిధి కేఎల్ఎం షోరూమ్ వద్ద రోడ్డుపై వరదనీరు భారీగా నిలిచిపోయింది. దీంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మన్సూరాబాద్ లోతట్టు కాలనీలు గణేశ్‌నగర్, శ్రీసాయినాథ్‌కాలనీ, మల్లికార్జుననగర్ నార్త్, ఆగమయ్యకాలనీ, హకీమాబాద్, కామినేని చౌరస్తా నుంచి మన్సూరాబాద్ చౌరస్తా వరకు, సెంట్రల్‌బ్యాంకు కాలనీలోని రోడ్లు జలమయమయ్యాయి.

అదేవిధంగా నాగోల్ డివిజన్ పరిధి ఆనంద్‌నగర్ చౌరస్తా, శ్రీనివాసకాలనీ, విజయగార్డెన్, బండ్లగూడ, అయ్యప్పకాలనీ, త్యాగరాయనగర్ కాలనీల్లో రోడ్లపైకి వరదనీరు చేరడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి.

పగలు ఎండ.. సాయంత్రం వాన

బడంగ్‌పేట: పగలంతా ఎండ.. సాయంత్రం వాన దంచి కొట్టింది. భారీ వర్షానికి వాతావరణం ఒక్కసారిగా కూల్‌గా మారింది. మహేశ్వరం నియోజకవర్గంలో గురువారం సాయంత్రం రెండు గంటల పాటు వాన ఎడతెరిపిలేకుండా కురిసింది. తుక్కుగూడ, జల్‌పల్లి, మీర్‌పేట, బడంగ్‌పేట తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. కాలనీల్లోకి వరద నీరు వచ్చి చేరింది. రోడ్లు జలమయంగా మారాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

గాలి వీచిందా.. కరెంటు గోవిందా!

ఎల్బీనగర్ : వర్షం పడిందంటే చాలు.. గట్టిగా గాలి వీచిందటే చాలు కరెంటు కష్టాలు మొదలువుతున్నాయి. గురువారం సాయంత్రం వాతావరణం చల్లబడిన వెంటనే కరెంటు కోత ప్రారంభమైంది. ఆ వెంటనే సుమారు గంటకుపైగా భారీగా కురిసిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. భారీ వర్షంతోపాటు కరెంటు లేకపోవడంతో నివాసాల్లో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షం వచ్చిందంటే కరెంటు పోయినట్లే అన్నట్లుగా పరిస్థితి తయారయ్యిందని, భవిష్యత్‌లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీసాయినాథ్‌కాలనీని ముంచెత్తిన వరదనీరు

సైదాబాద్ ఎల్ఐసీ కాలనీలో వర్షానికి విద్యుత్ తీగలపై కూలిన చెట్టుకొమ్మలు

వరదనీరు పోయేలా మ్యాన్‌హోళ్లు తెరిపిస్తున్న మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్

నల్గొండ చౌరస్తావద్ద స్తంభించిన ట్రాఫిక్

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద రోడ్డుపై వరద నీటిలో వెళ్తున్న వాహనదారులు

చంపాపేట రెడ్డికాలనీలో కుంటను తలపిస్తున్న వరద నీరు

చంపాపేట డివిజన్‌లో వరదనీటితో అవస్థలు

చంపాపేట, మే 16 : ఏప్రిల్ నుంచి ఉష్ణోగ్రతలు పెరగడంతో నగరమంతా వేడెక్కి ప్రజలు ఉక్కపోత తట్టుకోలేక ఉక్కిరి బిక్కిరయ్యారు. ఈనేపథ్యంలో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో నగరమంతా ఒక్కసారిగా తడిసి ముద్దయింది. దీంతో ఉక్కపోత నుంచి నగర వాసులకు కొంత ఊరట లభించినట్లయింది. చంపాపేట డివిజన్ పరిధిలోని లోతట్టు కాలనీలు రెడ్డికాలనీ, మారుతినగర్, రాజిరెడ్డినగర్, ఎస్‌జీఆర్ కాలనీల్లో వీధులన్నీ వర్షపు నీటితో నిండి కుంటలను తలపించాయి. దీంతో రాకపోకలకు అంతరాయం కలగడంతో కాలనీల వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం వరద సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టేదని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూసారాంబాగ్‌లో భారీ వర్షానికి ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నది

30 నుంచి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

మలక్‌పేట, మే 16 : యోనెక్స్ సన్‌రైజ్ రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2024 పోటీలు ఈ నెల 30 నుంచి జూన్ 2 వరకు న్యూ నాగోల్ సౌభాగ్యనగర్ లోని ఆర్3 బ్యాడ్మింటన్ ఎక్సలెన్సియా(గ్రీన్ అండ్ రెడ్)లో జరుగనున్నాయని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కరెడ్ల శ్రీనివాసరావు తెలిపారు. గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో టోర్నమెంట్ వివరాలను వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్, జూనియర్, మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ క్రీడాకారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న ఈ పోటీల్లో సబ్ జూనియర్ అండర్-13,అండర్-15 ఇయర్స్ విభాగాల్లో బాల, బాలికల సింగిల్స్, డబుల్స్, జూనియర్స్ అండర్-17, అండర్-19 ఇయర్స్ విభాగాల్లో బాల, బాలికల సింగిల్స్, డబుల్స్, మెన్ అండ్ ఉమెన్ విభాగంలో(35 నుంచి 80 ఏండ్ల వయసు గల వారు)సింగిల్స్, డబుల్స్, వెటరన్ మెన్ అండ్ ఉమెన్ విభాగంలో సింగిల్స్ అండ్ డబుల్స్ పోటీలు నిర్వహించనున్నామని శ్రీనివాసరావు తెలిపారు. క్రీడల్లో పాల్గొనేందుకు ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 26 లోపుగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్(https:// btronline.in//)చేయించుకోవాలని, స్పాట్ ఎంట్రీస్ ఉండవని తెలిపారు. పూర్తి వివరాలకు 7788993006, 9848015443 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇన్లైన్ హాకీ క్రీడాకారిణి నందితకు ఎమ్మెల్యే ప్రశంసలు

మన్సూరాబాద్, మే 16: మన్సూరాబాద్ డివిజన్ పరిధి జడ్జెస్‌కాలనీకి చెందిన టంగుటూరి నందిత ఇటీవల రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఇన్లైన్ హాకీ సీనియర్ ఉమెన్ క్యాటగిరి పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. దాంతో సెలక్టర్లు త్వరలో ఇటలీలో జరిగే ఇన్లైన్ స్కేటింగ్ హాకీ పోటీలకు ఇండియా టీమ్‌లో నందితకు స్థానం కల్పించారు. నందిత గురువారం తన తండ్రి టంగుటూరి నాగరాజుతో కలిసి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నందితను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇన్లైన్ స్కేటింగ్ హాకీ ఆడుతున్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వనస్థలిపురం డివిజన్‌లో రోలర్ స్కేటింగ్ గ్రౌండ్‌ను నిర్మించినట్లు తెలిపారు. అక్కడే ప్రాక్టీస్ చేసిన నందిత ఇండియా టీమ్‌కు సెలక్ట్ కావడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ సభ్యుడు శ్రీనివాస్, కోచ్ సత్యంతో పాటు ఆమెను ప్రోత్సహించిన తండ్రి నాగరాజును ఎమ్మెల్యే అభినందించారు.

టంగుటూరి నందితను అభినందిస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

నర్సింహ కుటుంబానికి పీఆర్టీయూ ఆర్థికసాయం

సైదాబాద్, మే 16 : ముషీరాబాద్ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల-1 ప్రిన్సిపాల్ బొడ్డుపల్లి నర్సింహ అకాల మరణం బాధకరమని పీఆర్టీటీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. గురువారం నర్సింహ కుటుంబసభ్యులను ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి, పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మధుసూదన్ రెడ్డి, టి. తిరుపతిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సింహ సతీమణి వర్షితకు లక్ష రూపాయల చెక్కును అందజేశారు. అనంతర వారు మాట్లాడుతూ పీఆర్‌టీఆయూలో క్రియాశీల సభ్యుడిగా పనిచేస్తున్న నర్సింహ అకాల మరణం తమకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ నాయకులు పాల్గొన్నారు.

నర్సింహ కుటుంబసభ్యులకు లక్ష రూపాయల చెక్కును అందజేస్తున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, తదితరులు

నేటి నుంచి బీరప్పస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు

మన్సూరాబాద్, మే 16: మన్సూరాబాద్ డివిజన్ పరిధి సరస్వతినగర్ కాలనీ సమీపంలోని బీరప్పస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలను శుక్రవారం నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ కర్రె శంకర్, ప్రధానకార్యదర్శి జమ్ము కృష్ణయ్య తెలిపారు. ఆలయ ప్రాంగణంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 17 నుంచి 20 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 19న స్వామి వారి బోనాల ఊరేగింపు, 20న ఉదయం బీరప్ప, కామరాతి స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకోవాలని వారు కోరారు.

వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన సరస్వతినగర్ సమీపంలోని బీరప్పస్వామి ఆలయం

నేదునూరులో చోరీ

- రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, 50వేల నగదు అపహరణ

చిందర వందరగా పడవేసిన బీరువాలోని దుస్తులు

కందుకూరు, మే 16 : మండలంలోని నేదునూరు గ్రామంలోని ఓ ఇంట్లో బంగారం, నగదును దుండగులు అపహరించుకుపోయారు. పోలీసుల కథనం ప్రకారం.. నేదునూరుకు చెందిన కొమ్ము జంగయ్య బుధవారం రాత్రి తన భార్యతో కలిసి భోజనం చేసి అనంతరం ఇంట్లో ఉక్కపోతగా ఉండటంతో ఇంటికి తాళం వేసి డాబాపై నిద్రించారు. గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి అల్మారాను పగుల గొట్టి అందులోని వస్తువులను చిందర వందర చేసి తులం బంగారు మాటీలు, తులం బంగారు గొలుసు, అర తులం ఉంగరం, మొత్తం 2 1/2 తులాల బంగారంతోపాటు రూ. 50 వేల నగదును అపహరించి పరారయ్యారు. ఉదయం జంగయ్య భార్య నవనీత ఇంట్లోకి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించింది. వెంటనే జంగయ్య కందుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ మక్బూల్ జానీ తెలిపారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

చర్లపల్లి, మే 16 : మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని రెడ్డి కాలనీలో గురువారం కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులతో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలు సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకురాలు భాగ్యమ్మ, రమాదేవి, నవనీత, అరుణ, సంధ్య, మున్ని, శిరీషా, గిరజ తదితరులు పాల్గొన్నారు.

రైతులు పత్తి సాగుపై దృష్టి సారించాలి

- సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ చంద్రకాంత్

హయత్‌నగర్, మే 16 : రైతులు అధిక దిగుబడినిచ్చే పత్తి పంట సాగుపై దృష్టి సారించాలని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ చంద్రకాంత్ ఎంహెచ్ అన్నారు. గురువారం హయత్‌నగర్‌లోని కేంద్రీయ పత్తి పరిశోధన సంస్థ నాగ్‌పూర్ ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం, రంగారెడ్డి సహకారంతో జిల్లాలోని వ్యవసాయ అధికారులు, పత్తి విత్తన సంస్థలు(రాశి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, సీడ్ వర్క్స్)తో సమావేశం నిర్వహించారు. 2024-25లో అధిక సాంద్రత పత్తి సాగు విధానం, దగ్గర అంతరం, పత్తి సాగుపై చర్చించారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి ఎస్.గీతారెడ్డి, ప్రత్యేక పత్తి ప్రాజెక్టు నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.విజయకుమార్, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.సుజాత, నివేదిత, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, పత్తి సంస్థ నిపుణులు, సంబంధిత పత్తి సంస్థల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ చంద్రకాంత్

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ

మేడ్చల్ రూరల్, మే 16 : జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా మేడ్చల్ మండలంలోని శ్రీరంగవరం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మమత మెడికల్ కళాశాల సౌజన్యంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలకు డెంగీ వ్యాధి నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ లావణ్య, సీహెచ్‌వో మహాలక్ష్మి, పీహెచ్ ఎన్ మరియమ్మ, సూపర్ వైజర్ బుజ్జి, మమత మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజా విక్రం ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

వనస్థలిపురం, మే 16 : బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పాపిరెడ్డి కాలనీ కమాన్ వద్ద రోడ్డు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. కాలనీ ముఖద్వారం వద్ద నిర్మించిన స్ట్రామ్ వాటర్ డ్రైన్ పక్కన మట్టి కుంగిపోయింది. దీంతో అక్కడి నుంచి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో కార్పొరేటర్ గురువారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో డ్రైన్‌ను నిర్మించారని, అధికారుల నిర్లక్ష్యం కారణంగా మట్టి కుంగిపోయిందన్నారు. అనంతరం ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.

స్ట్రామ్ వాటర్ డ్రైన్ చాంబర్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఏక్ భారత్..శ్రేష్ఠ్ భారత్ శిబిరం ప్రారంభం

మేడ్చల్, మే 16 : వివిధ రాష్ట్రాల మధ్య సంస్కృతి, సంప్రదాయాల బదిలీనే లక్ష్యంతో ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డీడీజీ వీఎం రెడ్డి తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ సెట్ ఆడియటోరియంలో ఏక్ భారత్..శ్రేష్ఠ్ భారత్ శిబిరం గురువారం ప్రారంభమైంది. ఈ శిబిరం ప్రారంభానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఎన్‌సీసీ డీడీజీ, ఎయిర్ కమాండోర్ వీఎం రెడ్డి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల మధ్య తమ సంస్కృతి, సంప్రదాయాల బదిలీకి ప్రతి ఏటా ఏక్ భారత్..ఏక్ శ్రేష్ఠ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏడాదికి రెండు శిబిరాలు జరుగుతాయన్నారు. ఇదే కాకుండా నేషనల్ ఇంటిగ్రేటెడ్ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులకు ఉంటారని తెలిపారు. సీఎంఆర్‌లో నిర్వహిస్తున్న శిబిరంలో తెలుగు రాష్ట్రాల విద్యార్థులతో పాటు రాజస్థాన్ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. మొత్తం 600 మంది విద్యార్థులు ఉండగా 150 మంది రాజస్థాన్ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. మొత్తం ఆరు గ్రూపులను ఏర్పాటు చేశారని తెలిపారు. శిబిరంలో విద్యార్థులు తమకు ఉన్న సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లను పంచుకుంటారని తెలిపారు. ఒకే చోట ఉండటంతో తెలుగు రాష్ట్రాల విద్యార్థులతో, రాజస్థాన్ విద్యార్థులతో సంస్కృతి, సంప్రదాయాలు వేరైనా కలిసిపోతారని తెలిపారు. గతేడాది గజ్వేల్‌లో నిర్వహించిన శిబిరంలో వేరే రాష్ట్రాలకు చెందిన విద్యార్థినులతో మన రాష్ట్ర విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడారని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన కూడా ఉంటుందన్నారు. ఈ ప్రదర్శనల ద్వారా ఇరు రాష్ట్రాల విద్యార్థులు తన రాష్ట్రాల్లో ఉన్న నృత్యాలపై అవగాహన పెంచుకుంటారని తెలిపారు.

కార్యక్రమంలో ఎన్ఎసీసీ అధికారులు కల్నల్ సంజయ్ గుప్తా, కల్నల్ డోగ్రా, కల్నల్ అనిల్‌కుమార్, లెఫ్టినెంట్ కల్నల్ ఆనంద రావు, లెఫ్టినెంట్ కల్నల్ శ్రీనివాస్, మేజర్ మీను తోమర్, రాజస్థాన్ ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ అమిత్, జ్యోతికుమారి, అన్షుల్ సక్సేనా, లలిత్ చౌదరి, సుబేదార్ రాజేశ్ సింగ్, నాయబ్ సుబేదార్ రాచ్‌పాల్ సింగ్, హవల్దార్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్‌సీసీ డీడీజీ వీఎం రెడ్డి

భక్తిశ్రద్ధలతో వార్షికోత్సవాలు

వనస్థలిపురం, మే 16 : ప్రశాంత్‌నగర్‌లోని సాయిబాబా దేవస్థానం వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం రెడ్డి సంక్షేమ సంఘం గ్రేటర్ అధ్యక్షుడు సంరెడ్డి భుజంగరెడ్డి ఉత్సవాల్లో పాల్గొని బాబాకు ప్రత్యేక పూజలు చేశారు.

వనస్థలిపురం శిశువు మృతిలో వైద్యుల నిర్లక్ష్యం లేదు..

సిటీబ్యూరో,మే16(నమస్తే తెలంగాణ): వనస్థలిపురం ఏరియా దవాఖానలో శిశువు మృతి చెందిన ఘటనలో వైద్యుల నిర్లక్ష్యం లేదని సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రియ పేర్కొన్నారు. సూర్యాపేటకు చెందిన వివాహిత మూడో కాన్పుకు మంగళవారం నాడు ఏరియా దవాఖానలో చేరింది, కాగా అదేరోజు అర్ధరాత్రి నొప్పులు రావడంతో ప్రసవం సమయంలో శిశువు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు డాక్టర్ హరిప్రియ ఒక ప్రకటన విడుదల చేశారు. గర్భిణీ దవాఖానలో అనారోగ్య సమస్యలతో క్లిష్టమైన పరిస్థితిలో చేరిందన్నారు. ఎక్స్‌పెక్టెడ్ డెలివరీ డేట్ మే 25 కు ఉండగా ఈనెల 14న దవాఖానలో చేరిన ఆమెకు ఆదేరోజు ప్రసవం జరిగి శిశువుకు బొడ్డుతాడు జారడం వల్ల శిశువు మృతి చెందిందని వెల్లడించారు. చిన్నారి మృతి ఘటనలో వైద్యుల నిర్లక్షం లేదని ఆమె ప్రకటనలో పేర్కొన్నారు.

కొత్తపేట గ్రామంలో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మించండి..

ఎల్బీనగర్, మే 16 : కొత్తపేట డివిజన్‌లోని కొత్తపేట గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఎదురు బస్తీలో డ్రైనేజీ నిర్మించకపోవడంతో మురుగునీటి సమస్యలతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్తీలో డ్రైనేజీ సమస్యలపై అధికారులు స్పందించి నూతన పైప్‌లైన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా పనులు ప్రారంభించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని బస్తీవాసులు కోరుతున్నారు.